## క్లుప్తంగా

### రాయితీ జొన్న విత్తనాల పంపిణీ


రామళ్లకోటలో జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

వెల్దుర్తి: మండలంలోని రామళ్లకోట గ్రామంలో రైతులకు 80 శాతం రాయితీపై జొన్న విత్తనాలను పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్, ఏఓ అక్బర్‌బాషాతో కలిసి పంపిణీ చేశారు. మంగళవారం నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఏడీఏమాట్లాడుతూ..రూ.700విలువైన మూడు కేజీల హైబ్రిడ్ జొన్న విత్తనాల ప్యాకెట్‌ను రైతులకు కేవలం రూ.140కే అందిస్తున్నట్లు తెలిపారు. జొన్న సాగు చేయదలచిన రైతులు రాయితీ విత్తనాలను తమ సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పొందవచ్చన్నారు. వీఏఏ సాంబశివుడు, రైతులు పాల్గొన్నారు.

### పెట్టుబడి సాయం ఏదీ?


కైరుప్పల సచివాలయంలో వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు అందించాలని, వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కైరుప్పల సచివాలయంలో వీఏఏ బసవరాజుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ మీటర్ల కోసం ఇచ్చిన జీఓ 22ను రద్దు చేయాలని, రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, నాయకులు శివరాం, పెద్దవీరభద్రి, రామాంజినేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

### 13న క్రీడా పోటీలు


ఆస్పరిలో ఏంఈఓలకు వినతి పత్రం ఇస్తున్న పీడీలు

ఆస్పరి: ఈనెల 13వ తేదీ మండలంలోని పుటకల మర్రి మోడల్ స్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోర్డినేటర్ విజయ్ ఆనంద్‌రావు, మండలంలోని పీడీలు ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, తిరుమలరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆనంద్‌రావు మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా 2024-25కు సంబంధించి అండర్-14, అండర్-17 బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

### రోడ్డును బాగుచేయాలని నిరసన



ఆలూరు-పెద్దహోతూరు రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని సీపీఎం జిల్లా నాయకులు పీఎస్ రాధాకృష్ణ, నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆలూరు నుంచి కర్నూలు, బళ్లారి రహదారిలో(పెద్ద హోతూరు) సుమారు 150 వరకు గుంతలు పడ్డాయని ఆరోపిస్తూ మంగళవారం రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. సీపీఎం, రైతు సంఘం నాయకులు హనుమంతు, ఈరన్న, కృష్ణ, షాకీర్ పాల్గొన్నారు. అదే విధంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు.

### ఎల్లార్తిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు


ఎల్లార్తి దర్గా పరిసరాల్లో చెత్తను తొలగించి చదును చేస్తున్న ట్రాక్టర్

హొళగుంద: ఎల్లార్తిలో ఈ నెల 29వ తేదీ ప్రారంభమయ్యే ఉరుసు సందర్భంగా దర్గాకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ముళ్లకంపలు, చెత్తచెదారాన్ని తొలగిస్తున్నారు. దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున ఆధ్వర్యంలో షేక్‌షావలి, షాషావలి దర్గాల పరిసరాల్లో ప్రొక్లెన్, ట్రాక్టర్లతో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ప్రధాన రోడ్లలో ముళ్ల కంపలను తొలగిస్తున్నారు. గ్రామస్తులు పారిశుద్ధ్యంలోపించకుండా సహకరించాలని కోరారు.

# విజయవాడ విలయం చంద్రబాబు నిర్వాకమే

- ఇంటిని కాపాడుకునేందుకు వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా నీటి మళ్లింపు
- ముఖ్యమంత్రి నిర్లక్ష్యానికి 50 మందికి పైగా మృత్యువాత
- వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ (ఆళ్లగడ్డ): వరదల బారి నుంచి ప్రజలను కాపాడి.. వారికి భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వార్థం, నిర్లక్ష్యం.. ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే విజయవాడ ప్రాంతం వరద నీటిలో మునిగి విలయవాడగా మారిందని, 50 మందికి పైగా మరణించగా వేలాది మంది నిరాశ్రయులయ్యారని ధ్వజమెత్తారు. వరద పోటెత్తి ఎనిమిది రోజులు దాటినా ప్రజలు బిక్కుబిక్కుమంటూ వరద నీటిలోనే కాలం వెళ్లదీస్తున్నారని, సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కనీసం బాధితులకు ఆహారం, మంచినీరు కూడా అందించలేకపోతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఇంటికి 3 కి.మీ దూరంలో ఇంత పెద్ద విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకోలేకపోవడం ముఖ్యమంత్రి వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. తుపాను, వరదలపై వాతావరణ శాఖ ముందుస్తు హెచ్చరిక చేసినా ముఖ్యమంత్రి ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వరదల్లో మరణాలకు చంద్రబాబే కారణమని, బుడమేరు ఆధునికీకరణ పనులు చేపడితే టీడీపీ నేతలకు చెందిన భూములు పోతాయనే భూసేకరణ చేపట్టలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు నివాసంతో పాటు ఏబీఎన్ రాధాకృష్ణకు చెందిన పవర్ ప్రాజెక్టుకు నష్టం జరుగుతుందనే ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకుండా అర్ధరాత్రి వరద నీటిని మళ్లించి విజయవాడ మీదకు వదిలి ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. జరిగిన దారుణాన్ని కప్పిపుచ్చుకునేందుకు కెమెరాలు పట్టుకుని అధికారులను వెంటేసుకుని తిరగడం వల్లే సహాయక చర్యలు సైతం జరగడం లేదన్నారు. అపార అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు కనీసం వరద బాధితులకు ఆహారం అందించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వరద బాధితులను సత్వరం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# మోరీ.. సమస్యల సవారీ

- రైతులకు ఉపయోగపడని రైల్వే వంతెనలు
- పంటల సమయంలో తీవ్ర ఇబ్బందులు
- బ్రిడ్జిల కింద నిల్వ నీటిని మళ్లించాలని కోరుతున్న రైతన్నలు


కెనాల్ కాదు.. పెరవలి సమీపంలో రైల్వే బ్రిడ్జి కింద చేరిన వాన నీరు (ఫైల్)


మద్దికెర వద్ద బ్రిడ్జి కింద నిలిచిన వాన నీరు (ఫైల్)


మోరీల కష్టాలపై రైల్వే అధికారులకు వివరిస్తున్న రైతులు (ఫైల్)

మద్దికెర: రైలు వచ్చేటప్పుడు ట్రాక్ దాటే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించేందుకు, తిరుగుతున్న రైళ్లు ఆలస్యమైతే గేటు కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకూడదని రైల్వే శాఖ వారు గేట్లను తీసివేసి అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. రైల్వే వారు ప్రమాదాలు జరగకుండా మోరీలు నిర్మించారు గానీ వాటి వద్ద సమస్యలు సవారీ చేస్తున్నాయి. వానా కాలంలో బ్రిడ్జిల కింద నీరు నిలిచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని ఆయా ప్రాంతాలలో రైల్వే ట్రాక్‌ల కింద నాలుగు మోరీలను ఏర్పాటు చేశారు. బ్రిడ్జి సైజును పెంచాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎత్తును పెంచినా మోరీలో నీరు పోయేందుకు దారి లేకపోవడంతో వర్షం వచ్చిన పుడల్లా నీరు నిలుస్తోంది. మండలంలోని మద్దికెర, హంప, పెరవలి గ్రామాలకు చెందిన గేటు అవతల మద్దికెర ఉత్తరం, పడమర రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు మోరీకి అవతలివైపు దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. భారీ వర్షాలకు మోరీలో వాన నీరు చేరడంతో అవతలివైపు వెళ్లేందుకు రోజుల తరబడి అంతరాయం ఏర్పడుతోంది. గతేడాది లోతు తెలియక రైతు కుటుంబం అలాగే వెళ్లడంతో ఎద్దులబండి, ఎద్దులు నీటిలో చిక్కుక్కొని చివరకు ఇతర రైతుల సహాయంతో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. ఇబ్బందిగా ఉన్న బ్రిడ్జిల కింద నీటిని పంపింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తామని రైల్వే అధికారులు రెండు రోజుల క్రితం హామీ ఇచ్చారు. హామీ మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇంకెన్నాళ్లు మోరీల వద్ద ఇబ్బందులు పడాలోనని ఆవేదన వ్యక్తం చేశారు.


రైల్వే ట్రాక్ కింద మార్గంలో వాన నీటిలో చిక్కుకున్న ఎద్దులు, బండి (ఫైల్)

### పలుమార్లు అధికారులకు తెలియజేశాం



రైల్వే ట్రాక్ కింద మోరీ వద్ద వర్షపు నీరు నిలవడం వల్ల రోజుల తరబడి వ్యవసాయ పనులకు వెళ్లలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు రైల్వే అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. నీటిని తరలించడానికి పైపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పైపులు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తే రైతులకు సమస్య తీరుతుంది.

– కిష్టన్న, రైల్వే రిటైర్డు ఉద్యోగి, మద్దికెర.

### వర్షాలు వస్తే ఆందోళనే!



భారీ వర్షాలు వచ్చాయంటే చాలు ఆందోళన పడాల్సి వస్తోంది. రైల్వే మోరీల వద్ద భారీగా నీరు నిలవడం వల్ల రైతులతో పాటు ఎద్దులు, ట్రాక్టర్లు అవతలి వైపుకు రాకపోకలు సాగించేందుకు వీలుపడదు. సంబంధిత రైల్వే అధికారులు రైతుల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– కృష్ణ, మద్దికెర గ్రామం

### సకాలంలో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నాం



వానా కాలంలో రైల్వే మోరీల వద్ద నీరు చేరడం వల్ల సకాలంలో వ్యవసాయ పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. నీటి నిలిచిపోకుండా ముందుకు పారేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. లేకపోతే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.

– సుధాకర్, పెరవలి, మద్దికెర మండలం

### జీఓ 85కు వ్యతిరేకంగా వైద్యుల ఆందోళన

తుగ్గలి: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకొచ్చిన జీఓ 85కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ పిలుపు మేరకు దశల వారీ ఆందోళనలో భాగంగా మంగళవారం పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, తుగ్గలి, పగిడిరాయి, మద్దికెర, దేవనకొండ పీహెచ్‌సీల ఎదుట వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధుల్లో పాల్గొన్నారు. గత రెండు నెలలుగా జీఓ 85ను రద్దు చేయాలని అధికారులకు, శాసన సభ్యులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదన్నారు. కోవిడ్ సమయంలో జీవితాలను ఫణంగా పెట్టి సేవలందించినప్పటికీ తమకు అన్యాయం చేస్తూ జీఓ తీసుకురావడం దారుణమని వాపోయారు. ఈ జీఓ ద్వారా తమ మూడేళ్ల సర్వీసు ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లోని పీహెచ్‌సీల వైద్యులు అరుణ్, నాగాంబిక, సుజాత, కార్తీక్, ప్రవీణ్ కుమార్, ప్రతిమ, హరిత, మినాజ్‌పాషా, శ్రీలక్ష్మి, రాగిణి, కళ్యాణ్ విజయభాస్కర్, అరుణజ్యోతి పాల్గొన్నారు.

### పంట నమోదుకు ఐదు రోజులే గడువు

కృష్ణగిరి: ఖరీఫ్ పంటల నమోదుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉందని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మంగళవారం కృష్ణగిరి, బాపనదొడ్డి, ఎరుకలచెర్వు గ్రామ పొలాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలవ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 59,500 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 54,700 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులు ఐదు రోజుల్లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పత్తికొండ వద్ద దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

పత్తికొండ(తుగ్గలి): అధిక వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రైతు లక్ష్మన్నకు చెందిన టమాట పంటను మంగళవారం సాయంత్రం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. అధిక వర్షాలకు వందలాది హెక్టార్లలో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేయాలన్నారు. వేరుశనగ, కంది, సజ్జ, జొన్న, కొర్ర పంటలకు ఎకరాకు రూ.20 వేలు, ఉల్లి, పత్తి, మిరప, టమాట పంటలకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని, రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు రైతు సంఘం, సీపీఐ నాయకులు పంపన్న గౌడ్, రాజాసాహెబ్, తిమ్మయ్య, ఉమాపతి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తు న్న వర్షాలతో సంభవించిన నష్టాన్ని జాతీయ విపత్తు గా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అలారుదిన్నె గ్రామంలో హంద్రీ పరివాహక ప్రాంతంలో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్న, నాయకులు తిమ్మయ్య, నాగేంద్రయ్య, కొండప్ప, రామాంజనేయలు,నాగరాజు పాల్గొన్నారు.

### ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

చిప్పగిరి: మండలంలోని బంటనహాలు రైల్వేస్టేషన్‌లో రైల్వే పట్టాలు దాటడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్టేషన్‌లో గూడ్స్ రైళ్లు ఆగినప్పుడు ప్రజలు ప్రమాదకరంగా రైలు కింద నుంచి పట్టాలు దాటుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. మల్లికార్జున, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### తెర్నెకల్‌లో డెంగీ కేసు నమోదు


గ్రామంలో మందులు స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది, సర్పంచ్


దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో నాలుగేళ్ల బాలికకు డెంగీ సోకినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో వ్యాధి వచ్చిన చుట్టుపక్కల ప్రాంతాల్లో సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో యాంటీ లార్వా మందులు పిచికారీ చేయించినట్లు చెప్పారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించామని, దీని వల్ల నీటిలో ఉన్న దోమల లార్వా చనిపోతుందన్నారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య రానీయొద్దు

ఆలూరు: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీఈ మల్లికార్జునయ్య ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద మండలాలకు చెందిన ఏఈలతో మంగళవారం సమావేశమయ్యారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో పనులు పూర్తి చేసిన వాటికి బిల్లులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని.. క్లోరినేషన్ చేసిన తర్వాతనే నీటిని విడుదల చేయాలని సూచించారు.

### గంగమ్మ ఒడికి గణనాథుడు


వెల్దుర్తిలో ఊరేగింపుగా సాగుతున్న వినాయకులు


హంద్రీనీవా కాలువలో విగ్రహాల నిమజ్జనం

వెల్దుర్తి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 45 గణనాథుడి విగ్రహాలు మంగళవారం గంగమ్మ ఒడికి చేరాయి. నిర్వాహకులు మధ్యాహ్నం పూజాది కార్యక్రమాలు నిర్వహించి పట్టణ పురవీధుల గుండా కోలాటం, నృత్యాలు, డీజేల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి లద్దగిరి రోడ్డులోని హంద్రీనీవా కాలువలో నిమజ్జనం గావించారు. నిమజ్జన కార్యక్రమం సాయంత్రం ఆలస్యంగా ప్రారంభమయ్యింది. పోలీసులు రాముల దేవాలయం నుంచి మళ్లించడంతో శోభాయాత్ర వేగంగా సాఫీగా సాగింది. సీఐ మధుసూదన్ రావ్, ఎస్‌ఐ అశోక్‌లు అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

### జాబ్‌మేళా నిరుద్యోగులకు వరం

పత్తికొండ(తుగ్గలి): జాబ్‌మేళాలు నిరుద్యోగులకు వరమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. మేళాలో 95 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 41 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాధురి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సంస్థ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్తాఫ్ పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన

కృష్ణగిరి: ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం కృష్ణగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు నిరసన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతూ జీఓను తీసుకొచ్చిందని వైద్యాధికారి ప్రదీప్ వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ జీఓ జారీ చేయడం దారుణమన్నారు. దీనికి నిరసనగా 11, 12 తేదీల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ఆందోళన కొనసాగిస్తామని, 13వ తేదీ నాటికి అత్యవసర సేవలు మినహా అన్ని సేవలు నిలిపివేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

### రైతులకు మేలు చేసే జోకుమారుడు

మద్దికెర: వినాయక చవితి ముగిసిన మరుసటి రోజే జోకుమారుడు జన్మిస్తాడు. మంగళవారం మద్దికెరలో జోకుమారుడి ప్రతిమను గంపలో ఉంచుకొని ఒక వర్గానికి చెందిన మహిళలు ఇంటింటికి తిరిగి పాటలు పాడుకుంటూ ధాన్యం సేకరిస్తున్నారు. జోకుమారుడు రైతులకు ఎంతో మేలు చేస్తాడని వారు తెలిపారు. మట్టితో చేసిన జోకుమారుడి విగ్రహాన్ని 9 రోజుల అనంతరం ఎలాంటి అలంకరణలు లేకుండా గంపలో వేపాకు మధ్య పెట్టుకుని మాహాలయ పున్నమి రోజున నీళ్లులేని కుంటలో నిమజ్జనం చేస్తారు. ఆ రోజు గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటారు.

### దశల వారీగా ఆందోళన


ఆస్పరిలో మాట్లాడుతున్న జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ రఘురామిరెడ్డి

ఆస్పరి: జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా మంగళవారం నుంచి దశల వారిగా ఆందోళనలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్, డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్లు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 85 వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి జీఓను రద్దు చేయాలని ఎమ్మెల్యేలు, అధికారలకు వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు. ఈ నెల 13వ తేదీ అత్యవసర సర్వీసులను మినహాయించి, అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేస్తామన్నారు. 14వ తేదీ పీహెచ్‌సీల్లో కేవలం అత్యవసర సేవలకు మాత్రమే పరిమితం చేస్తామన్నారు. 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం, 16న నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# వినాయకుడి సేవలో ఎమ్మెల్యే విరూపాక్షి


హాలహర్విలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విరూపాక్షి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హాలహర్వి: మండల కేంద్రంలోని కొత్తగేరి హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని మంగళవారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ నాయకులు కక్ష సాధింపులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, నాయకులు పరశురామ్, అర్ధగేరి శ్రీనివాసులు, గూళ్యం వీరేశప్ప, బాపురం కృష్ణ, దరగప్ప, తలారి పరశురామ్, పల్లె రవి, బసవరాజ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు,.

### కూలిన మట్టిమిద్దెలు

వెల్దుర్తి: మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో ఇటీవలి వర్షాలకు తడిసి మెత్తబడ్డ రెండు మట్టిమిద్దెలు మంగళవారం కూలిపోయాయి. గొల్ల ఎల్లరాజు కుటుంబీకులు ఇంటి వరండాలో నిద్రకు ఉపక్రమిస్తుండగా ఇంటి లోపలి భాగం కూలిపోయింది. అదే గ్రామానికి చెందిన రాజు కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా లోపలి భాగం కూలిపోయినట్లు గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన


హొళగుందలో పత్తి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త, ఏడీఏ

హొళగుంద: మండల కేంద్రంతో పాటు మార్లమడికి గ్రామంలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి, మిరప తదితర పంటలను మంగళవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త రాఘవేంద్ర, ఆలూరు ఏడీఏ సునీత, ఏఓ ఆనంద లోకదళ్ పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు వందలాది ఎకరాల్లో పత్తి, మిరప పంటలను సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు రంగుమారి కుళ్లిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతులు, రైతు సంఘాల నాయకులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. పంట రంగు మారడం, కాయలు కుళ్లిపోవడం, రాలడంతో పాటు దిగుబడి రాకపోవడం తదితర అంశాలకు సంబంధించి వివరాలు సేకరించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏడీఏ సునీత, ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు. తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట రైతులు సిందువాళ కృష్ణయ్య, ఎర్రిస్వామి, పంపాపతి, వెంకటేష్ ఏఈఓ విరుపాక్షి, వీఏఏలు భారతిబాయ్, మణిశ్రీ ఉన్నారు.